

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

శనివారం 4 అక్టోబర్ 2025 పేజీలు 8


# డ్రైవర్ల సంక్షేమం కోసం మరో ముందడుగు

- ఆటో డ్రైవర్ సేవలో పథకం ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా 2,90,669 మంది లబ్ధిదారులు
- గత ప్రభుత్వంతో పోల్చితే 50% ఎక్కువ ఆర్థిక సహాయం
- డ్రైవర్ల ఖాతాల్లో నేరుగా రూ.436 కోట్లు జమ
- రోడ్ల మరమ్మతులకు రూ.1,000 కోట్లు
- గుంతల సమస్యకు శాశ్వత పరిష్కారం
- భారీ గ్రీన్ ట్యాక్స్ తగ్గింపుతో వాహనదారులకు ఉపశమనం
- ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడి



విజయవాడ మేజర్ న్యూస్ : రాష్ట్రంలో డ్రైవర్ల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం మరో వినూత్న పథకానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో "ఆటో డ్రైవర్ సేవలో" పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద ఆటో రిక్షా, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి రూ. 15 వేలు ఆర్థిక సహాయం అందించబడనుంది. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సింగ్ నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో సభ ఏర్పాట్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, కలెక్టర్ జి.లక్ష్మీశా, పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, మున్సిపల్ కమిషనర్ ధ్యాన్ చంద్ర, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, రాష్ట్ర నాగవంశం సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఎరుబోతు రమణారావుతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ శుక్రవారం సాయంత్రం పర్యవేక్షించారు. మిగతా 2లో



# పొడి చెత్తకు నిత్యవసర సరుకులు..

## జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలసి స్వచ్ఛ రథాలను ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పొడి చెత్తను తీసుకొచ్చిన వారికి బదులుగా నిత్యవసర సరుకులు అందిస్తామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం సాయంత్రం మంత్రి నగరంలోని కోనేరు సెంటర్లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి స్వచ్ఛ రథం వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల మిగతా 2లో...

ప్రణాళిక బద్ధంగా ధాన్యం సేకరణకు...

# అన్ని ఏర్పాట్లు చేయాలి

## కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



మచిలీపట్నం మేజర్ న్యూస్ : జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రణాళిక బద్ధంగా ధాన్యం సేకరణకు అన్ని మిగతా 2లో...

# విజయవంతంగా దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు

## వీఎంసీ సిబ్బందిని అభినందించిన విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర దసరా శరన్నవరాత్రుల ఉత్సవ వేడుకలలో చివరి రోజైన విజయదశమి రోజున భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగరాదని, వినాయకుని గుడి, కెనాల్ రోడ్, మోడల్ గెస్ట్ హౌస్, వాటర్ పాయింట్లు, టాయిలెట్ల పాయింట్లు, మిగతా 12లో

(మొదటిపేజీ తరువాయి)



## డ్రైవర్ల సంక్షేమం కోసం మరో ముందడుగు

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 2,90,669 మంది డ్రైవర్లు ఈ పథకానికి అర్హులుగా గుర్తించబడి, వారి ఖాతాల్లో నేరుగా రూ.436 కోట్లు జమ చేయనున్నారని. గత ప్రభుత్వ కాలంలో కేవలం రూ.10 వేలు మాత్రమే ఇచ్చారని, కాని ప్రస్తుత కూటమి ప్రభుత్వం 50% అదనంగా ఇస్తూ, డ్రైవర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నట్లు మరోసారి నిరూపిస్తోందన్నారు. లబ్ధిదారుల సంఖ్య కూడా 30 వేల వరకు పెంచడం ద్వారా మరింత మంది డ్రైవర్లు ప్రయోజనం పొందేలా చర్యలు తీసుకుందని ఎంపీ వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక డ్రైవర్లకు మేలు కలిగించే పలు నిర్ణయాలు తీసుకున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. ముఖ్యంగా, రాష్ట్రంలోని రోడ్ల మరమ్మతులకు రూ.1,000 కోట్లు ఖర్చు చేసి డ్రైవర్లకు గుంతల రోడ్ల సమస్య నుండి విముక్తి కలిగించిందని అన్నారు. అలాగే గత ప్రభుత్వంలో వాహనదారులపై మోపిన భారీ గ్రీన్ ట్యాక్స్‌ను తగ్గించడం ద్వారా డ్రైవర్లకు గణనీయమైన ఉపశమనం కల్పించిందని ఆయన గుర్తుచేశారు. ఈ పథకం మేనిఫెస్టోలో హామీ ఇవ్వకపోయినా, స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం అమలులోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల ఆదాయం తగ్గిపోకుండా వారిని ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని రూపకల్పన చేసిందని ఎంపీ తెలిపారు. "ఏ ఒక్క అర్హుడూ మినహాయింపు కాకుండా ప్రతి డ్రైవర్ కుటుంబానికి ఈ ఆర్థిక సహాయం చేరేలా ప్రభుత్వం ప్రత్యేక ఫిర్యాదు వ్యవస్థను, వాట్సాప్ ఆధారిత గ్రీవెన్స్ హ్యాండ్లింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసింది" అని ఎంపీ వివరించారు.

## పొడిచెత్తకు నిత్యావసర సరుకులు..



పరిశుభ్రత లక్ష్యంగా స్వచ్ఛ రథం వాహనాలను ప్రారంభించామన్నారు. వ్యర్థాలను సేకరించేందుకు కృష్ణాజిల్లాలోని నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏడు స్వచ్ఛ రథాలను కేటాయించామని తెలుపుతూ వీటి ద్వారా ఇనుము, ప్లాస్టిక్, పేపర్లు వంటి పొడి చెత్తను సేకరించడం జరుగుతుందన్నారు. పొడి చెత్తను సేకరించి అందించిన వారికి స్వచ్ఛ రథం వాహనం దగ్గర దానికి సమానమైన నిత్యావసర సరుకులు అందించడం జరుగుతుందన్నారు. గత సంవత్సరం అక్టోబర్ రెండవ తేదీ గాంధీ జయంతి రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి మచిలీపట్నం నగరాన్ని సందర్శించినప్పుడు డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తరలించేందుకు ఆదేశాలు ఇచ్చారని, ప్రస్తుతం దానిని 75 శాతంమేర తరలించామని, మిగిలిన చెత్తను త్వరలోనే తరలించి స్వచ్ఛ ప్రాంతంగా చేస్తామన్నారు. చెత్తను తరలించేందుకు ఉన్న రెండు కంపాక్టర్లకు అదనంగా మరో కంపాక్టర్ ను రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు మంజూరు చేసిందని, వీటి ద్వారా జిల్లాలోని చెత్తను ఎప్పటికప్పుడు తరలించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం,2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు పది సూత్రాలను ఏర్పాటు చేసిందని వివరిస్తూ దానిలో స్వచ్ఛ ఆంధ్ర అనేది కీలకమైన ఒక సూత్రమని తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాలో ఏడు స్వచ్ఛ రథాలను ప్రారంభించుకోవడం జరిగిందని, వీటి ద్వారా గ్రామాల్లో గృహాల వద్ద వృధాగా పేరుకుపోయిన ఇనుము, ప్లాస్టిక్, పేపర్లు, అట్ట పెట్టెలు, గాజు సీసాలు తదితర పొడి చెత్తను సేకరించి స్వచ్ఛ రథం వద్ద అందించినట్లయితే దానికి సమానమైన కందిపప్పు, మినప గుళ్ళు, పేస్టు, షాంపూ, కొబ్బరి నూనె, సబ్బులు, పెన్నులు, ఉల్లిపాయలు తదితర నిత్యవసర వస్తువులను అందించడం జరుగుతుందన్నారు. ఈ విధంగా చేయడం ద్వారా వ్యక్తిగతంగా లబ్ధి పొందడంతో పాటు పర్యావరణానికి మేలు చేసినట్లు అవుతుందని ఈ వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రజలందరూ తడి,పొడి చెత్తను వేరువేరుగా అందించి స్వచ్ఛ జిల్లాగా తయారు చేసేందుకు భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోని ఒక గ్రామ పంచాయతీలో ఈ కార్యక్రమం చేపట్టామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిణి డాక్టర్ జే అరుణ, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా అధికారి జడ్పీ డిప్యూటీ సీఈవో డాక్టర్ ఆనంద్ కుమార్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బోయ నాగమణి, మచిలీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాదివాడ రాము తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ప్రణాళికబద్ధంగా ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు చేయాలి





(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో సంయుక్త కలెక్టర్ ఎం నవీన్ తో కలిసి ధాన్యం సేకరణ పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి ఖరీఫ్ కాలంలో చాలా జాగ్రత్తలు పాటించి రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరించాలని సూచించారు. ఇందు కోసం ముందుగానే ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏలు) చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా గ్రైతులందరికీ ధాన్యం సేకరణ పై వారు పెద్ద ఎత్తున అవగాహన కలిగించాలన్నారు. గ్రామాల్లో వరి కోత స్థితిగతులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ఉన్నతాధికారులకు స్పష్టమైన సమాచారాన్ని చేరవేయాలన్నారు. జిల్లా కేంద్రంలో ఒక కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేసి దాన్యం సేకరణ సజావుగా జరిగేలా పర్యవేక్షించాలన్నారు. వరి ధాన్యం సేకరణ కేంద్రమైన రైతు సేవ కేంద్రాన్ని కాదని నేరుగా మిల్లర్ల దగ్గరికి పోకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పంట చేతికి వచ్చిన వెంటనే రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకొని ట్రక్ షీట్ జనరేట్ చేసుకొన్న తర్వాతనే మిల్లర్ల దగ్గరికి పోవాలన్నారు. మధ్య దళారులు అనవసరంగా జోక్యం చేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమస్యలు సృష్టించే వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు బనాయించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే తక్కువ ధరకు రైతులు ఎవరు అమ్మకుండా వారికి ధైర్యం చెప్పాలని సూచించారు. మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసే వారి పైన నిఘా ఉంచి రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో నియంత్రించాలన్నారు. ఈ-పంట నమోదు 90 శాతం పూర్తయిందని, నూటికి నూరు శాతం సత్వరమే పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మిల్లర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి ధాన్యం సేకరణ, తేమ శాతం కొలతలు తదితర అంశాలపై సంపూర్ణ అవగాహన కలిగించాలని సంయుక్త కలెక్టర్ కు సూచించారు. జిల్లాలోని అన్ని మిల్లులను తనిఖీ చేసి తేమశాతం కొలిచే యంత్రాలను పరిశీలించాలని, అన్ని ఒకే విధంగా కచ్చితత్వం, నాణ్యత ప్రమాణాలతో పని చేస్తున్నాయా లేదా గమనించాలన్నారు. ధాన్యం సేకరణకు వినియోగించే200 వాహనాలను సిద్ధం చేసి నమోదు చేశారని, ఇంకనూ మరిన్ని వాహనాలను వెంటనే నమోదు చేయించాలన్నారు. జిల్లాలోని మిల్లర్ల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాలన్నారు. జిల్లాలోని మిల్లర్ల సామర్థ్యానికి మించి ధాన్యం వస్తే ఇతర జిల్లాల మిల్లర్ల వద్దకు పంపేందుకు కూడా ముందుగానే ఏర్పాట్లు చేసుకుని సంసిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో గోతం సంచుల కొరత ఎట్టి పరిస్థితులను రాకూడదని, కన్నం ఉన్న గోతాలను సజావుగా కుట్టించి రైతులకు సరఫరా చేయాలన్నారు. మిల్లుల నుండి సీఎంఆర్ డెలివరీ పటిష్టంగా చేయాలని రొటేషన్ పద్ధతిలో పటిష్టంగా చేయాలని ఇందులో ఏమాత్రం జాప్యం చేయరాదన్నారు. ధాన్యం మూటలు రవాణాకు హమాలీల కొరత రాకుండా చూడాలన్నారు. ముఖ్యంగా పరిపక్వదశకు రాని వరి పంటను కోయకుండా రైతులను, యంత్రాల యజమానులను చైతన్య పరచాలన్నారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరాం ప్రసాద్, డీఎస్ఓ మోహన్ బాబు, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, మార్కెటింగ్ ఏడి నిత్యానందం, డి సి ఓ చంద్రశేఖర్, జిల్లా రవాణా అధికారి ఎన్ శ్రీనివాసు, తూనికలు కొలతల శాఖ సహాయ నియంత్రణ అధికారి భాను ప్రసాదు, జిల్లా రైస్ మిల్లుల సంఘం అధ్యక్షులు పిన్నమనేని వీరయ్య, డిసిఎంఎస్ ప్రతినిధి శ్రీధర్, ఎఫ్ పి ఓ లు రత్న కిషోర్, సుజయ్ కుమార్ తదితర అధికారులు అనధికారులు పాల్గొన్నారు.

# విజయవంతంగా దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)

కేశఖండన శాల, హోల్డింగ్ ఏరియా, ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దసరా నవరాత్రుల ఉత్సవ వేడుకలలో విజయదశమి చివరి రోజు అయినందున భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అధిక మొత్తంలో వాటర్ పాయింట్లలో త్రాగునీటి వాటర్ బాటిల్ స్టాక్ లను పెట్టుకుంటూ ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తుండాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ ఆదేశాల మేరకు నిర్వహించిన దసరా శరన్నవరాత్రుల ఉత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించినందుకు కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం వి ఎం సి సిబ్బంది కృషిని అభినందించారు. త్రాగునీటి సౌకర్యాలలో ఎటువంటి అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు వాటర్ బాటిల్ స్టాక్ లను నింపుకుంటూ క్యూ లైన్ లో వచ్చే వారికి త్రాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో హెడ్ వాటర్ వర్క్స్ నుండి వాహనాల సౌకర్యాలతో స్టాక్ పాయింట్లలో ఎప్పటికప్పుడు త్రాగునీరును స్టాక్ చేసుకుంటూ అక్కడనుండి మొదటగా ఏర్పాటు చేసిన 39 ప్రదేశాలలో వాటర్ పాయింట్లలో స్టాక్ ని పంపిణీ చేయటమే కాకుండా భక్తుల అవసరాలకు అనుగుణంగా అదనంగా 17 వాటర్ పాయింట్లను పెంచుతూ 56 ప్రదేశాలలో వాటర్ పాయింట్లను ఏర్పాటు చేసి అక్కడ కూడా త్రాగునీటి వాటర్ బాటిల్ లో పంపి నీకు ఎటువంటి అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు స్టాక్ పై నుండి వాటర్ బాటిల్స్ ను తెచ్చుకుంటూ కమాండ్ కంట్రోల్ రూమ్ సహాయంతో అవసరమైన ప్రతినిత్యం వెంటనే వాటర్ బాటిల్స్ ఉండేటట్టు చూసుకుందాం అన్నారు. 300 ఇంజనీరింగ్ అధికారులు, వెహికల్ డిపో సిబ్బంది సమన్వయంతో వాటర్ బాటిళ్ల పాయింట్లలో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకున్నాం అన్నారు. 19 ప్రదేశాలలో తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయడమే కాకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రమైన మరుగుదొడ్లను ప్రజలకు అందిస్తూ, మరుగుదొడ్లు పరిసర ప్రాంతాలలో కూడా ఎటువంటి దుర్వాసన రాకుండా 7000 లీటర్స్ సెంటెడ్ ఫినాల్ తో ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తున్నారని, 20 గర్పర్లతో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తున్నారని, తాత్కాలిక మరుగుదొడ్ల విషయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూసుకున్నారు అన్నారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన 6 చెప్పుల స్టాండ్, సామాన్లు భద్రపరచు ప్రదేశమును ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇటువంటి ఇబ్బంది లేకుండా వారి సామాన్లను భద్రంగా భద్రపరచడమే కాకుండా వారి సౌకర్యం కోసం అదనంగా 3 ప్రాంతాలలో చెప్పుల స్టాండ్లు, సామాన్లు భద్రపరచు ప్రదేశం పెంచి, మొత్తం తొమ్మిది ప్రదేశాలలో భక్తుల చెప్పులను సామాన్లను ఉచితంగా భద్రపరిచారని తెలిపారు.



350 మంది ఎస్టేట్ విభాగం నుండి ఈ నవరాత్రులలో దీని నిమిత్తం చేశారని పని చేశారని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేకంగా 1490 పారిశుద్ధ్య కార్మికులతో మూడు షిఫ్ట్ లలో పారిశుద్ధ్యంలో ఎటువంటి లోటు లేకుండా ఎప్పటికప్పుడు తాగేసి పడేసిన వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు ల వ్యర్థాలను తొలగిస్తూ గాట్ల వద్ద భవానిల దుస్తులు తొలగిస్తూ, దర్శనాల రహదారుల్లో 2700 డస్ట్ బిన్నులు, 25 ప్రదేశాలలో 60 కంపాక్టర్ బిన్నులను, ఆ వ్యర్థాలను తొలగించేందుకు 55 ట్రాక్టర్లు, డీసీఎం వాన్లు, సిఎన్జి ఆటోలు, కాంట్రాక్టర్ వంటి వాహనాలను ఉపయోగించి పారిశుద్ధ్య నిర్వహణ చేస్తూ, 25 మెట్రిక్ టన్నుల బ్లీచింగ్ పౌడర్ 50 మెట్రిక్ టన్నుల లైన్ పౌడర్లు దర్శన రహదారుల్లో వేశారని, మెరుగైన పారిశుధ్య నిర్వహ తో ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణన్ని కల్పించామని అన్నారు. ఇప్పటివరకు దాదాపు 650 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తొలగించారని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. మూలా నక్షత్రం రోజున అదనంగా 300 మంది సిబ్బందిని దసరా శరన్నవరాత్రుల ఉత్సవ లకు విధులు కేటాయించామని, భక్తులకు అమ్మవారి దర్శనానలో ఎక్కడ అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు వివిధ ప్రదేశాలు విధులు నిర్వహిస్తున్న వారు వారి అవసరాలను కమాండ్ కంట్రోల్ రూమ్ లో 24 గంటలు మూడు షిఫ్ట్ లలో పని చేస్తూన సిబ్బంది తో మాట్లాడి ఎక్కడ ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకున్నామన్నారు. దసరాసరన్నవరాత్రుల ఉత్సవాలలో విజయవాడ నగరపాలక సంస్థ వారు చేయవలసిన ఏర్పాట్లలో విజయవంతంగా నిర్వహించినందుకు వీఎంసి సిబ్బందిని అభినందించారు.

# విజయవాడలో ఆల్-రేంజ్ వెహికిల్ డీలర్షిప్ ప్రారంభం

## విజయవాడలో ఆల్-రేంజ్ వెహికిల్ డీలర్షిప్ ప్రారంభం






**విజయవాడ, అక్టోబర్ 03, మేజర్ న్యూస్ :** ఎక మొబిలిటీ, ప్రముఖ భారతీయ ఎలక్ట్రిక్ వెహికల్ మొబిలిటీ సొల్యూషన్స్ కంపెనీ, విజయవాడలో ఆర్ ఆర్ తన సరికొత్త ఆల్-రేంజ్ వెహికల్ డీలర్షిప్ను ప్రారంభించడం ద్వారా ఆంధ్రప్రదేశ్లో తన పరిధిని విస్తరించింది. విజయవాడలోని గుణదలలో, ఎన్టిఆర్ హెల్త్ యూనివర్శిటీ సర్వీస్ రోడ్డులో, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పక్కన 48-10-21/2బి వద్ద గ్రౌండ్ ఫ్లోర్లో ఉన్న ఎక షోరూమ్ వ్యూహాత్మకంగా యెన్ హెచ్ 16 పై స్థాపించబడింది, గుంటూరు, విశాఖపట్నం తిరుపతి వంటి ప్రధాన నగరాలకు సజావు కనెక్టివిటీని అందిస్తుంది. సమగ్ర 3ఎస్ ఫెసిలిటీ (అమ్మకాలు, సేవ విడిభాగాలు)గా స్థాపించబడిన ఈ డీలర్షిప్, కస్టమర్లు ఎక యొక్క ఎలక్ట్రిక్ వాహనాలను నిపుణుల మార్గదర్శకత్వంతో అనుభవించి కొనుగోలు చేయగల సమగ్ర కస్టమర్ అనుభవాన్ని అందిస్తుంది, అదే సమయంలో నిబద్ధతతో కూడిన సర్వీసు, నిజమైన విడిభాగాల మద్దతును కూడా పొందవచ్చు. 3,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ డీలర్షిప్, ఎలక్ట్రిక్ బస్సులు, ట్రక్కులు, చిన్న వాణిజ్య వాహనాలు తో సహా భారతదేశపు అతిపెద్ద శ్రేణి ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాలను ప్రదర్శిస్తుంది, ఇందులో ఎక ఏడుటి, 55 టి ఎలక్ట్రిక్ ట్రక్కులు, ఎక 7 ఎం,9ఎం & 12ఎం,ఎలక్ట్రిక్ బస్సులు, లో-ఫ్లోర్ బస్సులు, కోచ్లు, 3 డబ్ల్యూ ఎలక్ట్రిక్ కార్గో వాహనాలు, ఎక 3 ఎస్ - రోజువారీ రాకపోకలకు, సిటీ రైడ్ల కోసం 3 సీట్ల ప్యాసింజర్ ఈ వి,, ఎక 6ఎస్ - స్టీరింగ్ సౌకర్యంతో భారతదేశపు మొట్టమొదటి ఎలక్ట్రిక్ 3-వీలర్ ప్యాసింజర్ వాహనాలు ఉన్నాయి. ఈ ఆవిష్కరణ సందర్భంగా వ్యాఖ్యానిస్తూ, మిస్టర్. రోహిత్ శ్రీవాస్తవ, బిజినెస్ హెడ్, చీఫ్ గ్రోత్ ఆఫీసర్, ఈకేఏ మొబిలిటీ ఇలా అన్నారు, "విజయవాడ ఆంధ్రప్రదేశ్లో ఒక కీలక వాణిజ్య ఆవిష్కరణల కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ ఆర్ ఆర్ మొబిలిటీని ఏర్పాటు చేయడం ద్వారా వినియోగదారులకు ఒకే పైకప్పు క్రింద పూర్తి ఈ వి అనుభవాన్ని అందించగలిగే అవకాశాన్ని సృష్టించాము. స్థానిక వ్యాపారాలు నివాసితులకు పర్యావరణ అనుకూలమైన, నమ్మకమైన, ఆర్థికంగా అందుబాటులో ఉన్న వాహనాలను అందించడం మా లక్ష్యం," అని చెప్పారు. "ఎక మొబిలిటీతో మా భాగస్వామ్యం ఆవిష్కరణ, విశ్వాసం కస్టమర్-ఫస్ట్ సర్వీస్పై ఆధారపడింది. కలసి, ఆంధ్రప్రదేశ్లో వాణిజ్య మొబిలిటీ భవిష్యత్తును పునఃనిర్వచించడానికి మేము లక్ష్యంగా పెట్టుకున్నాం" అని మిస్టర్. ముప్పల్లా రోహిత్, మేనేజింగ్ డైరెక్టర్, ఆర్ఆర్ మొబిలిటీ అన్నారు. విజయవాడతో పాటు, కంపెనీ మహారాష్ట్రలోని ముంబైలో కొత్త డీలర్షిప్ను కూడా ప్రారంభించింది, ఇది దేశవ్యాప్తంగా తన అడుగుజాడలను మరింత బలోపేతం చేసింది. విచారణ కోసం సంప్రదించండి: దివ్య, ఆర్ఆర్ మొబిలిటీ: +91 9491237099

# "భారతదేశంలో పుంజుకుంటున్న ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం

**విజయవాడ, మేజర్ న్యూస్ :** "భారతదేశంలో పుంజుకుంటున్న ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం: రెట్టింపు అవుతున్న ఈ సి ఎం ఎస్ స్పందన, బజ్ పెంచుతున్న సెమికాన్ ఇండియా 2025 భారతదేశంలో ఎలక్ట్రానిక్స్ వృద్ధిపై పరిశ్రమ, ప్రభుత్వ విశ్వాసాన్ని ప్రశంసించిన ఐ ఈ ఎస్ ఎ ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ తయారీ పథకానికి వస్తున్న స్పందన నిజంగా అపూర్వం - రూ. 1.15 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు, దాదాపు 1.41 లక్షల ఉద్యోగాలు సృష్టించే నిబద్ధత, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బలమైన సహకారంతో భారతదేశపు ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ బలమైన వృద్ధితో విశ్వాసాన్ని ప్రదర్శిస్తోందని ఐ ఈ ఎస్ ఎ, సెమి ఇండియా అధ్యక్షుడు అశోక్ చండక్ వ్యాఖ్యానించారు. భారత దేశ ఎలక్ట్రానిక్స్ తయారీ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, అధిక దేశీయ విలువ జోడింపు ద్వారా దేశపు సెమీకండక్టర్ పాలసీ ఫ్రేమ్వర్క్కు అండగా నిలిచే ఈ మైలురాయి పథకాన్ని ప్రారంభించినందుకు ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖను ఐ ఈ ఎస్ ఎ, సెమి అభినందిస్తున్నాయి. విధాన-చర్చ దశ నుంచి అధికారికంగా దీన్ని 2025 ఏప్రిల్ 26న మంత్రి ప్రారంభించేంత వరకు అన్ని దశల్లోనూ ఐ ఈ ఎస్ ఎచురుగ్గా పాల్గొంది. ఈ ఆవిష్కరణలో ఈ సి ఎం ఎస్ ప్రోత్సాహం, అమలు కోసం పంచముఖ వ్యూహం: అంతర్జాతీయ సహకారాలు, రాష్ట్ర స్థాయి భాగస్వామ్యాలు, పంపిణీదారులతో సన్నిహిత సమన్వయం,ఈ ఎం ఎస్, ఓ ఈ ఎం పరిశ్రమలకు తోడ్పాటు, భారతదేశ విధానాలను ప్రపంచవ్యాప్త ప్రచారం చేయడం, సెమీకండక్టర్ రంగ చొరవలతో కలిసి ఉండేలా ఐఈఎస్ఎ వివరించింది. ఈ ప్రయత్నాలు ఎంఎస్ఎం ఈ శక్తిమంతం చేయడం, వ్యాల్యూ చైన్లు బ లోపేతం చేయడం, సాంకేతిక స్వీకరణ ప్రోత్సహించడం, వ్యాపారం చేయడం లో సౌలభ్యాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ ప్రతిపాదనలు పాసివ్ లు, మాడ్యూల్స్, పీ సి బిలు, డిస్ప్లేలు, కెమెరా, కేసింగ్లు, బ్యాటరీ సెల్స్, మరిన్నింటితో సహా విస్తృత శ్రేణి విడిభాగాల శ్రేణుల్లో విస్తరించి - ఎలక్ట్రానిక్స్ తయారీ ఇన్పుట్ల ఎండ్-టు-ఎండ్ అవసరాలను సమర్థవంతంగా గ్రహిస్తాయి. ప్రతిపాదనల అసలు లక్ష్యాలకు దాదాపు రెండింతలు ఎక్కువగా రావడం అనేది అపూర్వమైన స్పందన, ఎలక్ట్రానిక్ భాగాల తయారీకి ప్రపంచ కేంద్రంగా భారతదేశం అవతరిస్తుందనడానికి ఇది స్పష్టమైన సంకేతం. గత నెలలో జరిగిన సెమికాన్ ఇండియా 2025 కార్యక్రమం ద్వారా సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ సృష్టించిన కీలక చలనానికి ఇది తోడ్పాటుగా నిలుస్తుంది. స్పష్టమైన తయారీ వృద్ధి, స్థిరమైన ఉద్యోగ సృష్టి, బలమైన పర్యావరణ వ్యవస్థగా రూపాంతరం చెందేలా ఈ ప్రతిపాదనలు ఉండేలా చూసేందుకు ప్రభుత్వం, పరిశ్రమలతో కలిసి పనిచేయడానికి ఐ ఈ ఎస్ ఎ, సెమి పూర్తిగా కట్టుబడి ఉన్నాయి.

# ఇండియన్ ఆయిల్ డైరెక్టర్గా సౌమిత్ర పీ శ్రీవాస్తవ బాధ్యతలు

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఇండియన్ ఆయిల్లో డైరెక్టర్ (మార్కెటింగ్)గా సౌమిత్ర పీ శ్రీవాస్తవ బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ ఆయిల్లో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. ఐఐటీ రూర్కీ నుంచి సివిల్ ఇంజినీరింగ్ పట్టభద్రులు. ముంబైలోని ఎస్పీ జైన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ & రీసెర్చ్ నుంచి ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ పట్టా పొందారు. ఎల్పీజీ వ్యాపార విభాగంలో నాలుగేళ్లు పని చేసిన తర్వాత సేల్స్ విభాగంలో పలు కీలక పదవులు నిర్వహించారు. ఈ సమయంలో వ్యాపార విస్తరణలో కీలకంగా మారారు. ఎగ్జిక్యూటివ్గా దిగువ స్థాయి ఆపరేషన్స్, మార్కెటింగ్, స్ట్రాటజీ రంగాలలో విస్తృత అనుభవం కలిగి ఉన్నారు. వ్యాపార వృద్ధి, లాభదాయకత, వినియోగదారుల సంతృప్తి వంటి అంశాలలో మంచి రికార్డు ఆయన సొంతం.



ఆయన నాయకత్వంలో నాన్-ఫ్యూయల్ కన్వీనియన్స్ స్టోర్స్, ధ్రువ రిటైల్ ట్రాన్స్ఫార్మేషన్ ప్రాజెక్ట్ వంటి ప్రధాన ప్రాజెక్టులు విజయవంతంగా అమలయ్యాయి. పలు సాంకేతికత, డిజిటలైజేషన్ ప్రాజెక్టులను కూడా ముందుకు నడిపారు. వరిటైల్ ట్రాన్స్ఫార్మేషన్ గ్రూప్ హెడ్గా, ఉత్తర, తూర్పు భారతానికి రిటైల్ బిజినెస్ హెడ్గా పని చేశారు. న్యూఢిల్లీ, ముంబైలోని డివిజనల్ కార్యాలయాలు నడిపిన అనుభవం ఉంది. పశ్చిమ ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో సేల్స్ విభాగాన్ని నడిపిన విస్తృత ఆపరేషనల్ నైపుణ్యం ఆయన సొంతం. మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల హెడ్ ఆఫ్ స్టేట్గా పని చేసిన సమయంలో ప్రధాన ఉత్పత్తులు, వ్యాపారాలను విజయవంతంగా నిర్వహించారు. ఈ నియామకానికి ముందు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కార్పొరేట్ స్ట్రాటజీ)గా పని చేశారు. ఈ పదవిలో ఆయన వినియోగదారుల సంతృప్తి, కార్యకలాపాలలో మెరుగైన సామర్థ్యం సాధించడానికి వ్యూహాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించారు. కొత్త భాద్యతల్లో ఆయన ఇండియన్ ఆయిల్ మార్కెటింగ్ మౌలిక సదుపాయాలకు వ్యూహాత్మక దిశను అందిస్తూ స్థిరమైన మార్కెట్ లీడర్షిప్, వినియోగదారుల సేవలపై దృష్టి సారించనున్నారు. కే జాన్ ప్రసాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (సీసీ & బ్రాండింగ్), మార్కెటింగ్ హెడ్ ఆఫీస్, ముంబై. ఈమెయిల్: jprasad1@indianoil.in




## బెస్పోక్ ఏఐ ఎయిర్ కండిషనర్లపై గో సేవ్ టుడే ప్రచారాన్ని ప్రకటించిన సామ్సంగ్

**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశపు అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్సంగ్, ఈ పండుగ సీజన్లోవినియోగదారులకు రూ. 21000 వరకు ఆదాను అందించే బెస్పోక్ ఏఐ ఎయిర్ కండిషనర్లపై "గో సేవ్ డే" ప్రచారాన్ని ప్రకటించింది. జీఎస్టీ రేటు తగ్గింపులు, మెరుగైన వారంటీ ప్రయోజనాలు, ఇంధన ఆదా అనే మూడు స్తంభాలపై నిర్మించబడిన గో సేవ్ టుడే ప్రచారం, ఈ పండుగ సీజన్లో వినియోగదారులకు సాటిలేని విలువను అందిస్తుంది. "గో సేవ్ టుడే" ప్రచారంలో భాగంగా, కస్టమర్లు ప్రీమియం బెస్పోక్ ఏఐ ఎయిర్ కండిషనర్ల కొనుగోలుపై ప్రత్యేకమైన 5-5-50 ఆఫర్ను పొందుతారు. సెప్టెంబర్ 22, నవంబర్ 10 మధ్య 50 రోజుల వ్యవధిలో కొనుగోలు చేస్తే, ఇప్పటికే ఉన్న 5 సంవత్సరాల సమగ్ర వారంటీకి అదనంగా 5 నెలల అదనపు సమగ్ర వారంటీ లభిస్తుంది. బెస్పోక్ ఏఐ ఎయిర్ కండిషనర్ కస్టమర్లు రూ.3800 వరకు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనం, రూ.1500 విలువైన ఉచిత ఇన్స్టాలేషన్, రూ.4000 వరకు బ్యాంక్ క్యాష్బ్యాక్ను కూడా పొందుతారు.

## ప్రపంచ ఆరోగ్య సంస్థ పొగాకు నియంత్రణ విధానాన్ని పరిశీలించిన ప్రపంచ ఆరోగ్య నిపుణులు

**విజయవాడ మేజర్ న్యూస్ :** కన్స్యూమర్ ఛాయిస్ సెంటర్ ఈ నెల ఫిలిప్పీన్స్లో 'హాని తగ్గింపు, ఫ్రేమ్వర్క్ కన్వెన్షన్ ఆన్ టొబాకో కంట్రోల్ నుంచి తప్పిపోయిన అవకాశాలు' అనే అంశంపై ఏడు దేశాలకు చెందిన వైద్యులు, పరిశోధకులు, వినియోగదారుల న్యాయవాదులను ఒకచోట చేర్చి విలేకరుల సమావేశాన్ని నిర్వహించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఫ్రేమ్వర్క్ కన్వెన్షన్ ఆన్ టొబాకో కంట్రోల్ కీలకమైన అంశాలను చర్చించేందుకు, పొగాకు సంబంధిత హానిని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ విధానాలను చర్చించేందుకు దీన్ని నిర్వహించారు. "ప్రపంచ పొగాకు నియంత్రణలో ఏది పని చేస్తుంది.. ఏది పనిచేయదు.. అనే దాని గురించి మాకు నిజాయితీతో కూడిన చర్చ అవసరం" అని హెల్త్ ఎకనామిస్ట్, కన్స్యూమర్ ఛాయిస్ సెంటర్ అధ్యక్షుడు ఫ్రెడ్ రోడర్ పేర్కొన్నారు. "చాలా దేశాలు హాని తగ్గింపు విధానాలతో విభిన్న ఫలితాలను చూశాయి. అయినప్పటికీ ఈ వ్యూహాలు ఆగ్నేయాసియా విధాన చర్చలలో అంతగా అన్వేషించలేదు" అని ఆయన తెలిపారు.

## పామర్రుని ఇండస్ట్రియల్ హబ్ గా చేయటమే కూటమి ప్రభుత్వం లక్ష్యం: ఎమ్మెల్యే కుమార్ రాజా



**పమిడిముక్కల మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కపిలేశ్వరపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన పద్మ శ్రీ ఇండస్ట్రీస్ ను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా విజయదశమి రోజున ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి నియోజకవర్గాన్ని ఇండస్ట్రియల్ హబ్ గా చేయుటమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు. పమిడిముక్కల మండలంలో పామాయిల్ నర్సరీ ద్వారా సాగు విస్తీర్ణం 2 వేలు హెక్టార్లు దాటుతున్న తరుణంలో హనుమాన్ జంక్షన్ 3ఎఫ్ కంపెనీ ఫ్యాక్టరీ పెట్టడానికి సన్నాహాలు చేస్తోందని వెల్లడించారు. తెలుగుదేశం హయాంలోనే నిమ్మకూరు వద్ద బెల్ కంపెనీ తీసుకొచ్చామని పేర్కొన్నారు. అధికారంలోనికి వచ్చిన ఆరు నెలల్లోనే శ్యామ్ ఆక్వా కు అడ్డంకులు తొలగించి తొమ్మిది నెలలలోనే కేంద్రమంత్రి శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రారంభించామన్నారు. ఉరుటూరులో జిఎస్ఆర్ ఆక్వా ఫ్యాక్టరీ త్వరలో ప్రారంభించబోతున్నామని తెలిపారు. ప్రస్తుతం కపిలేశ్వరం గ్రామంలో 27వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 10 కోట్ల వ్యయంతో 200 ఉద్యోగాలతో పద్మశ్రీ ఇండస్ట్రీ ప్రారంభించుకోవడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఇండస్ట్రీకి ఎటువంటి ఆంక్షలు, షరతులు లేకుండా వెంటనే అనుమతులు ఇచ్చామని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి పలువురికి ఉపాధి కల్పించిన యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వైభవంగా ముగిసిన దేవి శరన్నవరాత్ర మహోత్సవాలు





**పామర్రు మేజర్ న్యూస్ :** గత 11 రోజులుగా జరుగుతున్న శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో గల దేవాలయాలు భక్తులతో విజయదశమి పండుగ సందర్భంగా కిటికీటలాడాయి. భక్తులు ఉదయం నుండి అమ్మవారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేయించారు విజయదశమి సందర్భంగా అమ్మవార్లను శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అలంకారం చేశారు. మండల కేంద్రమైన పామర్రులోని శ్రీ అంకమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని శ్రీ రాజ రాజేశ్వరి దేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని శ్రీ లలితా సహస్రనామ పారాయణం చేశారు. స్థానిక బుచ్చమ్మ ఆశ్రమంలో, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవార్లను శ్రీ శ్రీ రాజ రాజేశ్వరి దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముక్తేవి గౌతమ్ మాధవ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజ చేశారు. ఆయా దేవాలయాలలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.









## భక్తిప్రపత్తులతో అమ్మవారి ఊంజల్ సేవ

**గుడ్లవల్లేరు అక్టోబరు 3 మేజర్ న్యూస్ :** దసరా నవరాత్రుల్ని పురస్కరించుకుని మండలంలోని డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి సన్నిధిలో అమ్మవారికి ఊంజల్ సేవను వేద మంత్రోచ్ఛరణ నడుమ వేద పండితులు నిర్వహించారు. మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి భక్తిప్రపత్తులతో అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

## ఊరేగింపులో కళాకారుల విన్యాసాలు

### ముగిసిన అమ్మవారి ఉత్సవాలు

### వైభవంగా శ్రీవాసవీమాత ఊరేగింపు, అన్నదానం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. 11 రోజుల పాటు అమ్మవారిని వివిధ అవతారాలలో అలంకరించి విశేష పూజలు చేశారు. విజయదశమి రోజున దేవాలయాల్లో శమీపూజ నిర్వహించారు. చల్లపల్లిలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఊరేగింపు ఉత్సవం సంబరంలా సాగింది. చల్లపల్లి పురవీధుల్లో అమ్మవారికి ఊరేగింపు ఉత్సవం నిర్వహిం చగా, భక్తులు స్వాగతం పలికి పూజలు చేశారు. రాజమండ్రికి చెందిన నిడదవోలు ఆనందరావు గ్రూపు కళాకారులు వేషధారణలతో, నృత్యవిన్యాసాలతో ఆకట్టుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆలయంలో భకు లకు అన్నసమారాధన జరిగింది. కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కొల్లిపర మధు, అన్నవరపు పాండురం గారావు, ఉడత్తు బాబు, జూపూడి సాయి, వరదా హరిగోపాల్, కొల్లిపర నరేంద్ర, తమ్మన సతీష్, వరదా రాజశేఖర్, రాంప్రసాద్, జల్లూరు ప్రసాద్, చుండూరు ప్రభాకర్ తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## శ్రీకాకుళం అయోధ్య రామాలయంలో అన్న సమారాధన



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామం సోమిశెట్టి బజారులోని అయోధ్య రామాలయంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించగా చల్లపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం, ఘంటసాల ఆర్ఐ కె.శ్రీనివాస్ లు ప్రారంభించారు. సుమారు 600 మంది భక్తులు అన్న సమారాధనలో పాల్గొన్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం చల్లపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం, ఘంటసాల ఆర్ఐ కె.శ్రీనివాస్, శ్రీకాకుళం విఆర్ఓ గోపి లను కమిటీ సభ్యులు సత్కరించారు. కటారి తాతయ్య, సుగ్గున రాంబాబు, సోమిశెట్టి గణేష్ (పండు), సోమిశెట్టి రవి, అడపా విజయ్, సోమిశెట్టి వెంకట నారాయణ, సోమిశెట్టి శివనాగేశ్వరరావు, సోమిశెట్టి ముసలయ్య, సోమిశెట్టి సత్యం, బడే జైకృష్ణ, రావూరి సాయి బసవ, సోమిశెట్టి రమేష్, మేక పాములు, సోమిశెట్టి మంగా కుమార్, భక్తులు పాల్గొన్నారు.

## మేడూరు రామాలయంలో ప్రత్యేక పూజలు చేసిన మంత్రి పార్ధసారథి, ఎమ్మెల్యే కుమార్ రాజా



**పమిడిముక్కల మేజర్ న్యూస్:** శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవములు సందర్భంగా పమిడిముక్కల మండలం మేడూరు గ్రామంలో గల కోదండ రామాలయం దేవస్థానములో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్ధసారథితో కలిసి పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూజలు చేయించి ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మంత్రి పార్ధసారథి, ఎమ్మెల్యే కుమార్ రాజాలను ఘనంగా సత్కరించారు. తొలుత గ్రామస్తులు మేళతాళా లతో మంత్రి పార్ధసా రథి, ఎమ్మెల్యే కుమార్ రాజాలకు ఘనస్వాగతం పలికి ఆలయానికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## చోరగుడిలో పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే కైలే

**పమిడిముక్కల మేజర్ న్యూస్:** దసరా మహోత్సవాల సందర్భంగా మండల పరిధిలోని చోరగుడి గ్రామంలో గల పలు ఆలయాల్లో పామర్రు మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ అమ్మవార్లను దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అర్చకులు ఆయనకు ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్ తో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెంట్రప్రగడ శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే



**పెదపారుపూడి మేజర్ న్యూస్:** శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవములు సందర్భంగా పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ గ్రామంలోని శివాలయం లో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికి దేవాలయానికి తోడ్కొని వచ్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే కుమార్ రాజాకు ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు మండల పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి, పిఎసిఎస్ అధ్యక్షులు కూచిపూడి వెంకటసుబ్బారావు లతో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాకంబరీ దేవిగా దుర్గాదేవి



**మొవ్వ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కూచిపూడి గ్రామ పసుమర్తి వారి బజారు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా 12వ రోజైనా శుక్రవారం శాకాంబరీ దేవిగా దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భాగవతల శ్రీ నాగమణి భవానీ దీక్షలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు సేకరించారు.

# భక్తి శ్రద్ధల మధ్య ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు





**గన్నవరం, అక్టోబర్ 3, మేజర్ న్యూస్ :** గత 11 రోజులుగా భక్తిశ్రద్ధలతో కొనసాగిన శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవాలు మండల వ్యాప్తంగా అత్యంత వైభవంగా ముగిశాయి. విజయదశమి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో గల దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయదశమి రోజున అమ్మవార్లను శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అలంకరించారు. మండల కేంద్రం గన్నవరం గ్రామం ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ వద్ద గల శ్రీ గణపతి సుబ్రహ్మణ్యేశ్వర సహిత శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో కూడా అమ్మవారిని రాజరాజేశ్వరి రూపంలో అలంకరించగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు విశేష సంఖ్యలో పాల్గొని పండితులు గుదిమెళ్ళ దిలీప్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో శ్రీ లలితా సహస్రనామ పారాయణం, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.





## శ్రీ జ్ఞానసాయి సన్నిధిలో దసరా ఉత్సవాలు

**గుడ్లవల్లేరు అక్టోబరు 03 మేజర్ న్యూస్:** అంగలూరు శ్రీ జ్ఞానసాయి మందిరంలో విజయ దశమిని పురస్కరించుని ఉత్సవాలు అంగరంగ వైభవంగా అమ్మవారి ఊరేగింపుతో ముగిశాయి. శ్రీ దత్తసాయి గాయత్రి సహిత శ్రీ మహాలక్ష్మీ హోమ కార్యక్రమాన్ని మందిర ప్రధాన నిర్వాహకులు యలమంచి నాగమోహన్, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. 27రకాల ద్రవ్యాలతో అమ్మవారికి, జ్ఞానసాయికి విశేషాభిషేకాలు, సువర్ణ పుష్పాభిషేకాలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చనను నిర్వహించారు. బాబావారి మహా సమాధి ఉత్సవాలు చేశారు. శమీ పూజలు చేశారు. బాబావారి గ్రామోత్సవాన్ని వెండి పల్లకీలో చేపట్టారు. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కార్యక్రమాల్లో నిర్వాహకులు దుగ్గిరాల ఆంజనేయప్రసాద్, నాగవల్లీ, తిపిర్నేని రాజా తదితరులు పాల్గొన్నారు.

## కొండలమ్మను దర్శించుకున్న పెడన ఎమ్మెల్యే, ఆర్డీఓ



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ అక్టోబరు 03:** మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని దసరా నవరాత్రుల సందర్భంగా పెడన ఎమ్మెల్యే కాగిత కష్ణప్రసాద్, గుడివాడ ఆర్డీఓ జి.సుబ్రహ్మణ్యేశ్వరరావు దంపతులు దర్శించుకున్నారు. వారిని ఆలయ ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు దుశ్శాలువాలతో సన్మానించి అమ్మవారి చిత్రపటాలతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత వారి పేరిట అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలను ఒనరించారు. మాజీ ఆలయ చైర్మన్ బెల్లంకొండ ఏడుకొండలు, ఆలయ ఉత్సవ కమిటీ వారు పాల్గొన్నారు.







## రాజరాజేశ్వరి దేవిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి అమ్మవారు



**నాగాయలంక అక్టోబర్ 3 మేజర్ న్యూస్ :** నాగాయలంక గ్రామంలోని సబ్బినేని వారి బజారులో గల శ్రీ యల్లారమ్మ తల్లి అమ్మవారి దేవస్థానం వద్ద శ్రీ రాజరాజేశ్వరి దేవి మాతగా దర్శన భాగ్యము దేవస్థాన కమిటీ వారు కలిగించారు. దర్శన భాగ్యం నకు విచ్చేసిన భక్తులు, ముత్తైదువులు, సమూహిక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మ వారిని భక్తిశ్రద్ధలతో పూజించి పాడి పంటలు పశుసంపద పిల్లాపాపలు చల్లగా ఉండవ లెనని అమ్మ వారిని భక్తిశ్రద్ధలతో వేడుకొని అమ్మవారికి పాల పొంగళ్ళు నైవేద్యము మొక్కు బడులు చెల్లించినారు. కృష్ణానది ఒడ్డున ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం ఆస్థాన ప్రధాన అర్చకులు,మృదునూరి శ్రీనివాస శర్మ, అంబా జానకి రామ శర్మ, ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకరణలు చేసి రాజరాజేశ్వరి దేవిగా దర్శన భాగ్యమును కలిగించారు. అనంతరం అమ్మవారికి విశేష అర్చనలు పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యము తెల్లవారుజాము నుండి ఏర్పాటు చేశారు. నాగాయలంక గ్రామంలోని దేవి శ్రీ పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరి సమన్వితి శ్రీ నగరేశ్వర స్వామి వారి, దేవ స్థాన ప్రాంగణంలో దేవస్థాన ప్రధాన అర్చకులు, బ్రహ్మ శ్రీ, కొల్లిపర సుబ్బారావు నవరాత్రి మహోత్సవాల్లో భాగముగా కనకదుర్గ అమ్మవారి ప్రతిమ వద్ద పూజా కార్యక్రమాలు అత్యంత వైభోగముగా నిర్వహించారు. ఈరోజు అమ్మవారిని విశేష అలంకార చేసి శ్రీ రాజ రాజేశ్వరి దేవిగా అలంకరించి విశేష పూజలు అర్చనలు మేళ తాళాలతో కన్నుల విందుగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు దేవస్థాన చైర్మన్, చిట్టా సాంబశివరావు, చిట్టాశివ నాగేశ్వరరావు తాడికొండ సత్యనారాయణ చిట్ట వీర అన్నపూర్ణయ్య, చిట్టా శేఖర్, వంకా యల రాజేష్ కమిటీ పెద్దలు, విచ్చేసి అమ్మవారికి నైవేద్యములు సమర్పించి, కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. బావ దేవరపల్లి గ్రామంలో గల విజయ్ అంకాలదేవర దేవస్థాన ప్రాంగణంలోనూ కనకదుర్గ అమ్మవారి దసరా నవరాత్రి మహోత్సవాల సందర్భంగా విశేషాలంకారాలతో దసరా నవరాత్రి మహోత్సవాలు జరిగినాయి ఈ కార్యక్రమానికి ధర్మకర్త మా రెడ్డి వెంకటేశ్వరరావు మురళీధర్ రావు వెంకట కృష్ణారావు ఆవుల వెంకట చలపతిరావు రాజశేఖర మూర్తి బుజ్జి పాండురంగారావు తదితర గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాలు జయప్రదం చేసి అమ్మవారి సన్నిధిలో ఈరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బావ దేవరపల్లి గ్రామంలోని ఉరువులమ్మ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో దేవీ నవరాత్రి మహోత్సవము లు ఆలయ ధర్మకర్త బోగాది విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు దివిసీమ ప్రాంతంలో అత్యంత నై నంద కారాల మధ్య డప్పు నైవద్యాలతో మేల తాళాలతో దుర్గామాతను దివి ప్రాంత ప్రజలు కొలుస్తూ అమ్మవారికి శాంతి హోమాలు చేయించి కార్యక్రమాలు జరిపించారు.



## వెంటేశ్వరుని సన్నిధిలో దసరా ఉత్సవాలు



**గుడ్లవల్లేరు అక్టోబరు 3 మేజర్ న్యూస్:** మండలం లోని డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో దసరా నవరాత్రులను కనులపండు వగా నిర్వహించారు. వెంకటేశ్వరునికి వేద మంత్రో చ్ఛరణ నడుమ వేద పండితులు విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారిని గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా స్వామివారికి భక్తులు టెంకాయలు, పండ్లు సమర్పించి బ్రహ్మరధం పట్టారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నసమారాధన చేపట్టారు. అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి అన్న ప్రసాదాలను స్వీకరించారు. మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి భక్తిప్రపత్తులతో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

## కొండలమ్మ సన్నిధిలో ముగిసిన దసరా మహోత్సవాలు



**గుడ్లవల్లేరు అక్టోబరు 3 మేజర్ న్యూస్ :** మండలంలోని వేమవరంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రులు మహోత్సవాలు వైభవోపేతంగా ముగిశాయి. శ్రీ అమ్మవారికి సహస్రనామార్చన, విజయప్రాప్తికి శ్రీ లలితా, రుద్ర హవనములు జరిగాయి. దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు, మాజీ సర్పంచి కొడాలి రామరాజు, దేవస్థాన సభ్యులు తూము రాజ్యలక్ష్మీ, కళ్ళేపల్లి సుగుణ శేఖర్, వడ్లమూడి రవీంద్ర బాబు, పెద్దిబోయిన శ్యామలా దేవి, ఎక్స్-అఫీషియో మెంబర్ రుద్రపాక శరశ్చంద్ర శివ సంతోష్ శర్మ కుంకుమ పూజ, హోమాల్లో పాల్గొన్నారు.



## ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు



**పామర్రు మేజర్ న్యూస్:** తెలుగుదేశం పార్టీ పామర్రు టౌన్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్, తెలుగుదేశం పార్టీ పామర్ఱు టౌన్ అధ్యక్షులు పరసా సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు చాట్ల రమేష్, మంతెన రామాంజనేయులు, శ్రీనివాస్ తదితరులతో పాటు తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పామర్రు వైసీపీ కార్యాలయంలో...



**పామర్రు మేజర్ న్యూస్:** పామర్రులోని నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులు జాతిపిత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పామర్రు మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### పమిడిముక్కల మండల పరిషత్ కార్యాలయంలో..



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** పమిడిముక్కల మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీర్ల సీతారామరాజు, కార్యాలయ పరిపాలన అధికారి గోలి రామకృష్ణ, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ తదితరులు మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

### పెడన బస్టాండ్ సెంటర్లో..



**పెడన, మేజర్ న్యూస్:** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గురువారం స్థానిక బస్టాండ్ సెంటర్లో గల మహాత్మా గాంధీ మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద ఉన్న విగ్రహానికి, డాక్టర్ బాబా సాహెబ్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలనేసి ఘన నివాళులర్పించామని మున్సిపల్ చైర్పర్సన్ కటకం నాగ కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి తరానికి ఈ మహానుభావులు యొక్క చరిత్రను వివరించాలని ఈరోజు మన స్వేచ్ఛకు వారే కారణమని అటువంటి మహనీయుల చరిత్రను గుర్తుపెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి కౌన్సిల్ సభ్యులు పురపాలక సంఘ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

### ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో...



**నాగాయలంక మేజర్ న్యూస్ :** నాగాయలంక గ్రామంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద గల జాతిపిత మహాత్మా గాంధీ జయంతి కార్యక్రమం ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. జాతిపిత మహాత్మా గాంధీ పొట్టి శ్రీరాములు విగ్రహాలకుఆర్యవైశ్య ప్రముఖులు పూలమాల అలంకరించి నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలో తాడికొండ సత్యనారాయణ, చిట్టా వీర, అన్నపూర్ణయ్య, చిట్టా సాంబశివరావు, వంకాయల రాజేష్, చిట్టా శేఖర్ పెద్దలు పాల్గొని గాంధీ మహాత్ముని సేవలను కొనియాడుతూ అహింసా మార్గంలో ఎటువంటి విపత్కర పరిస్థితిలో నైనా విజయాలు సాధించిన వచ్చునని జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలు సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని ప్రసంగించి పొట్టి శ్రీరాములు ఆశయ మార్గంలో నడుచుకోవాలని ప్రసంగిస్తూ జయంతి కార్యక్రమం నిర్వహించినారు.

# గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** గురువారం మహాత్మా గాంధీ 156వ జయంతి పురస్కరించుకుని ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, డి.సి.ఎం.ఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపిచంద్‌తో పాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు. అంతరం మీడియాతో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ మహాత్మా గాంధీ గుజరాత్‌లోని పోర్బందర్‌లో జన్మించి, సౌతాఫ్రికాలో విద్యాభ్యాసం చేశారు. ఆ నాటి పరిస్థితులను గమనించి స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారు. అహింసవాదంతో అనేక ఉద్యమాలు నడిపి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చారు. గాంధీ పోరాటం ప్రతి ఒక్కరినీ ఉద్యమ బాట పట్టేలా చేసింది. ఈ రోజు మనం ఇంత స్వతంత్రంగా జీవించడం గాంధీ స్ఫూర్తి ఫలితం.గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతో ఉంది అని అన్నారు.

ఈ సందర్భంగా డి.సి.ఎం.ఎస్ చైర్మన్ బండి రామకృష్ణ మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపించిన మార్గం నేటికీ స్ఫూర్తిదాయకం. ఆయన అహింసా సిద్ధాంతం, దేశప్రేమ ప్రతి ఒక్కరికి ఆదర్శం. గాంధీ ఆశయాలను పాటిస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుంది అని అన్నారు.

# విజయదశమి అందరి జీవితాలలో విజయాలు చేకూర్చాలి





### జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు

### జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో ఘనంగా ఆయుధ పూజ నిర్వహించిన కృష్ణాజిల్లా ఎస్పీ దంపతులు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని పెరేడ్ మైదానంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని పోలీసు ఆయుధాలు, వాహనాలకు జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు,సతి సమేతంగా పూజలు నిర్వహించారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ,చెడుపై విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ రోజున ఆనవాయితీగా చేయు ఆయుధపూజను ఎస్పీ దంపతులు వేద మంత్రాల నడుమ నిష్టతో, శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ పూజలో పోలీసులు ఉపయోగించే ఆయుధాలతో పాటు మోటారు ట్రాన్సుపోర్ట్ విభాగంలోని వివిధ రకాల పోలీసు వాహనాలకు ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకూడదంటూ ప్రార్థిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులకు, సిబ్బంది, కుటుంబ సభ్యులకు విజయదశమి శుభాకాంక్షలు తెలియచేసినారు.

మన సంస్కృతి, సంప్రదాయాలు, పర్వ దినాల వేళ నిర్వ హించే కార్యక్రమాలలో గొప్ప సందేశం ఉంటుందన్నారు. మన జీవనానికి అవసరమైన వ్యవసాయ పనిముట్లు,వస్తువులు, ఆయుధాలను దైవంగా భావిస్తూ పూజించడం కృతజ్ఞతాభావాన్ని సూచిస్తుందన్నారు.శక్తికి ప్రతీకగా నిలిచే దుర్గామాత సమక్షంలో ప్రతి ఆయుధానికి ఎంతో శక్తి కలిగి ఉంటుంది.విజయాలను చేకూర్చే విజయదశమి పర్వదినోత్సవం అందరికీ సుఖ సంతోషాలు కలిగించాలని ఆకాంక్షించారు.శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది సఫలీకృతమవ్వాలని, జిల్లా పోలీసు శాఖ అన్ని విషయాలలో విజయవంతంగా ముందుకు సాగాలని ఆశిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ ఎస్పీ, డీఎస్పీ, సీఐలు, ఎస్ ఐలు, తదితరులు పాల్గొన్నారు.

### పట్టణ భూసంబంధ రికార్డుల సర్వే ద్వారా

# పట్టణ ప్రణాళిక బలోపేతం చేయుటకు సంసిద్ధం కావాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పట్టణ భూసంబంధ రికార్డుల సర్వే ద్వారా పట్టణ ప్రణాళిక బలోపేతం చేయుటకు సంసిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో పట్టణ సర్వే-నక్ష కార్యక్రమం పై సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని పట్టణ ప్రాంతాల్లో ఆధునిక పద్ధతులను అనుసరించి భూ సర్వే చేసి సంబంధిత రికార్డులను సజావుగా రూపొందించాలన్నారు. ఈ సర్వే ద్వారా పౌరులకు శాశ్వత భూ హక్కు కల్పించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం తాజాగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.ఈ సర్వే కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా అమలుపరుచుటకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో సంయుక్త కలెక్టర్ తో పాటు,మున్సిపల్ కమిషనర్లు, కె ఆర్ ఆర్ సి ఎస్డిసి, ఆర్డీవోలు, జిల్లా పంచాయతీ అధికారి, సర్వే భూ రికార్డుల సహాయ సంచాలకులు సభ్యులుగా ఉంటారన్నారు. ఈ కమిటీ జిల్లా స్థాయిలో సర్వే ప్రాజెక్టు పురోగతిని సమీక్షిస్తుందని, క్షేత్రస్థాయిలో సర్వే కార్యక్రమాల పనితీరును పర్యవేక్షిస్తుందని, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం చేసుకుంటూ ప్రజల సమస్యలను ఫిర్యాదులను పరిష్కరిస్తుందని, రాష్ట్రస్థాయి కమిటీకి సర్వే అమలుపై నివేదికలు సమర్పించాల్సి ఉంటుందన్నారు.ప్రభుత్వం తాడేపల్లిగూడెంలో ప్రయోగా త్మకంగా ఈ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించి పూర్తి చేసిందన్నారు. అక్కడికి సంయుక్త కలెక్టర్ నేతృత్వంలో ఒక బృందం వెళ్లి కార్యక్రమం తీరుతెన్నులను అధ్యయనం చేసి రావాలన్నారు.ఆ తదుపరి జిల్లాలో సర్వే కార్య క్రమాన్ని పకడ్బందీగా నిర్వహించుటకు మార్గం సుగమం అవుతుందన్నారు. సర్వే కార్యక్రమం సజావుగా జరిగేందుకు అవసరమైనన్ని రోవర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో సి ఆర్ డి ఏ డెవలప్మెంట్ ప్రమోషన్ డైరెక్టర్ సునీత, కే ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, గుడివాడ ఉయ్యూరు ఆర్డివోలు జి బాలసుబ్రమణ్యం బిఎస్ హేలా షారోన్, భూ సర్వే రికార్డుల ఏడి జోషిల, డిపిఓ డాక్టర్ జే అరుణ, మచిలీపట్నం, గుడివాడ, తాడిగడప మున్సిపల్ కమిషనర్లు బాపిరాజు, మనోహర్ రావు, నజీర్, అధికారులు పాల్గొన్నారు.



# వరద ముంపు కారణంగా నీట మునిగిన పంటలను పరిశీలించిన వైసీపీ నాయకులు



**పమిడిముక్కల మేజర్ న్యూస్:** పమిడిముక్కల మండలం ఐనపూరు గ్రామంలో కృష్ణానది వరద ముంపుకు గురై దెబ్బతిన్న పసుపు, కంద, మిర్చి, బెండ, చెరుకు పంట పొలాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. పామర్రు నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు మర్రి బాబురావు, ముస్లిం మైనార్టీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, వాలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షులు పోలిమెట్ల వంశీకృష్ణ, పమిడిముక్కల మండల వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ తదితరులు వరద కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లంకపల్లి, ఐనపూరు, ఐలూరు గ్రామాల్లో దాదాపు 300 ఎకరాలకు పైగా కృష్ణా నది వరద ముంపు వలన పంటలు దెబ్బతిన్నాయన్నారు. వరి, బెండ, మిరప,చెరుకు, పసుపు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. నీట మునిగిన పంటలకు నష్టపోయిన రైతులకు ఎకరాకు 35వేల రూపాయలు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని, కౌలు రైతులకు నష్టం జరగకుండా చూడాలని నియోజకవర్గ వ్యాప్తంగా వాతావరణం మార్పుతో అధిక వర్షపాతంతో పంటలు ఎదుగుదల లేక గణనీయంగా దిగుబడి తగ్గుతున్న నేపథ్యంలో అధికారులు తగిన అంచనాలు రూపొందించి పంట దిగుబడి తగ్గిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీ ప్రభుత్వం చెల్లించి రైతులని ఆదుకోవాలని కోరారు. గత వైయస్ ఆర్ సీపీ ప్రభుత్వం మాదిరిగా క్రాప్ ఇన్సూరెన్స్ అనేది రాష్ట్రంలో అన్ని రకాల పంటలకు నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని, కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. వైయస్ఆర్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అకాల వర్షాల వలన, ప్రకృతి వైపరీత్యాల వలన దెబ్బతిన్న పంటలకు వెంటనే నష్టపరిహారం అందించి రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో తీవ్రంగా వైఫల్యం చెందిందని, నియోజకవర్గంలో రైతుల దయనీయ పరిస్థితి చూస్తుంటే గుండె బరువెక్కుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులు వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని, రైతులకు వెంటనే పంట నష్టం అందిస్తే మరలా పంటలు వేసుకోవడానికి వెసులుబాటు దొరుకుతుందని వైయస్ఆర్ సీపీ నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పమిడిముక్కల మండల ప్రధాన కార్యదర్శి గొరికిపూడి బుజ్జి, మినుకూరి శ్రీనివాసరావు, పార్టీ కార్యవర్గ సభ్యుడు అరిగే చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యులు గుర్విందపల్లి వంశీ, సోషల్ మీడియా కో కన్వీనర్ మట్టా మహేష్, జుజ్జువరపు సురేష్, జుజ్జువరపు సామ్యేల్ తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపు పేదలకు ఎంతో ఉపశమనం



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** జీఎస్టీ తగ్గింపు ద్వారా ప్రజలకు ఎంతో ఉపశమనం లభిస్తుందని పామర్రు శాసనసభ్యులు వరల కుమార్ రాజా పేర్కొన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామంలోని పిఏసిఎస్ వద్ద శుక్రవారం జీఎస్టీ పై అవగాహన సదస్సును నిర్వహించారు ఈ సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు ద్వారా సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అంతేకాక వ్యాపార అభివృద్ధి జరగడం ద్వారా వ్యాపారస్తులు కూడా అభివృద్ధి సాధిస్తారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకున్న ఈ నిర్ణయం ప్రజలకు మేలుకలిగించే చారిత్రాత్మక అడుగు అని పేర్కొన్నారు. ముఖ్యంగా కూలీలు, రైతులు, చిరు వ్యాపారులు, మధ్యతరగతి ప్రజల జీవన వ్యయాలు తగ్గుతాయని, ఇదే సమయంలో వ్యాపార రంగం ఊపిరి పీలుస్తుందన్నారు. ఉత్పత్తి ఖర్చులు తగ్గడంతో వస్తువుల ధరలు తగ్గి వినియోగదారులకు లాభం చేకూరుతుందని వివరించారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు తో కలిసి గ్రామంలో పర్యటించి దుకాణదారులు, చిరు వ్యాపారులు, రైతులు, మహిళా సంఘాలతో సమావేశమై జీఎస్టీ తగ్గింపుతో కలిగే లాభాలను సులభమైన పద్ధతి లో వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.వి.శివ ప్రసాద్ యాదవ్, గ్రామ సర్పంచ్ చప్పిడి సమీర, కూటమి నాయకులు, అధికారులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి పింఛను అందజేత



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్:** మండల పరిధిలోని చాగంటిపాడు గ్రామం శివారు కళ్లంవారి పాలెం గ్రామస్థుడైన భీమవరపు ఉమామహేశ్వర రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా తెలుగుదేశం నాయకుల చొరవతో ఆయనకు ఆసుపత్రికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛను అందజేశారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉమామహేశ్వర్ రెడ్డికి శుక్రవారం సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ శశి కుమార్ ఆసుపత్రికి వెళ్లి పింఛను అందించారు. పెన్షన్ అత్యంత అవసరం ఉన్న తరుణంలో ప్రత్యేక శ్రద్ధ వహించి పెన్షన్ సకాలం లో అందించటానికి వచ్చిన తెలుగుదేశం పార్టీ నాయకులు కళ్లం కోటిరెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ కళ్ళం వంశీ కృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శశి కుమార్ లకు ఆయన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### టీడీపీ నేత వేణుగోపాల్ రెడ్డికి సతీవియోగం

**రెడ్డిగూడెం, అక్టోబర్ 3, మేజర్ న్యూస్:** రెడ్డిగూడెం మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత జానలపాటి వేణుగోపాల్ రెడ్డికి సతీవియోగం కలిగింది. ఆయన భార్య, రెడ్డిగూడెం-1 ఎంపీటీసీ సభ్యురాలు జానలపాటి స్వరాజ్యం శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శుక్రవారం ఉదయం రెడ్డిగూడెం గ్రామానికి విచ్చేసి ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. వేణుగోపాల్ రెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. ఎన్డీఏ కూటమి కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

# చెడుగుడు పోటీల్లో నెల్లూరు జిల్లా పల్లాలమ్మ జట్టు ప్రథమ స్థానం



**పెడన,మేజర్ న్యూస్ :** విజయదశమి సందర్భంగా మండల పరిధి లంకలకలవగుంట గ్రామంలో రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీల లో భాగంగా నెల్లూరు జిల్లా పల్లాలమ్మ జట్టు ప్రథమ స్థానం సాధించడంతో ప్రథమ బహుమతిగా నగదు 20 వేలు స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ చేతుల మీదగా అందించామని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఆ జట్టుకు 20వేల రూపాయల నగదును అందించారు. ఈ చెడుగుడు పోటీల కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుండి మొత్తం 32 జట్లు పాల్గొనక ప్రథమ ద్వితీయ తృతీయ నాలుగవ బహుమతులను ప్రకటించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కొనకళ్ళ జగన్నాధ రావు (బుల్లయ్య) ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ప్రథమ బహుమతిగా 20వేల రూపాయలు నగదును ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు, జగన్నాథరావు( బుల్లయ్య ) ప్రకటించి విజేతలకు అందించారు. ద్వితీయ బహుమతి 15 వేల రూపాయలను స్వర్గీయ కాగిత వెంకట్రావు జ్ఞాపకార్థం స్థానిక ఎమ్మెల్యే ఏలూరు జిల్లా వేమవరం పాడు జట్టుకు అందించారు. మూడవ బహుమతి పదివేల రూపాయలను పుల్లేటి వెంకటేశ్వరావు అందించిన 10 వేల బహుమతి నెల్లూరు జిల్లా గణేష్ జట్టు కైవసం చేసుకున్నారు. నాలుగో బహుమతి కటారి తాతారావు వీరబాబు అందించిన 5 వేల రూపాయలు లంకల కలవకుండా అంబేద్కర్ జట్టు కైవసం చేసుకున్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత ఆన్లైన్ గేమ్స్‌కు బానిసలు కాకుండా చెడుగుడు వంటి ఆటలు ఆడితే మానసిక ఉత్తేజం పెరుగుతుందని తెలిపారు. గ్రామీణ స్థాయిలో యువత క్రీడారంగంలో రాణించి పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.అనంతరం కొనకళ్ళ బుల్లయ్య మాట్లాడుతూ కబడ్డీ అనేది గ్రామీణ ప్రాంతానికి చెందిన క్రీడ అయినప్పటికీ, ఇప్పుడు అంతర్జాతీయ క్రీడగా మనం ఆదరిస్తున్నామన్నారు. యువకులు ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు ఆడాలని, తమ కుటుంబం చిన్ననాటి నుంచే క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఈ గ్రామానికి తన కుటుంబానికి ఉన్న ఎనలేని అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.అలాగే ఈ కార్యక్రమంలో పెడన జడ్పిటిసి సభ్యులు అర్జా వెంకట నగేష్, తెలుగు యువత అధ్యక్షులు కట్టా సతీష్ పాల్గొని ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ముత్యాల వెంకటస్వామి (ఏసుబాబు), కట్టా సూర్యచంద్రరావు, కాగిత సత్యప్రసాద్ లు విజేత జట్లకు అభినందనలు తెలియజేశారు.

## నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**పెదపారుపూడి మేజర్ న్యూస్:** మండల పరిధిలోని భూషణ గుళ్ళ గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు గోగం రామారావు నూతన గృహప్రవేశ వేడుకలలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రామారావు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమార్ రాజా తోపాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వృద్ధ మహిళకు సుఖీభవ ఫౌండేషన్ ఆర్థిక సాయం



**పెడన, మేజర్ న్యూస్ :** పేదలకు అండగా ఉండాలని ధ్యేయంతో సుఖీభవ ఫౌండేషన్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెబుతూ మండల పరిధి బల్లిపర్రు గ్రామంలో ఉన్న కాలనీలో ఊటుకూరి సుబ్బమ్మ అనే వృద్ధ మహిళ ఇటీవల తన భర్త మరణించడంతో కుటుంబం గడవలేని పరిస్థితి ఏర్పడిందని స్థానికంగా ఉన్న నిర్మల అనే మహిళ ద్వారా తెలుసుకొని ఆ వృద్ధ మహిళకు సుమారు నెలకు సరిపడా నిత్యవసర సరుకులు పంపిణీ చేశామని సుఖీభవఫౌండేషన్ చైర్మన్ అద్దంకి నాగ శంకర్ తెలిపారు. ఈ మేరకు ఆమె నివాసం వద్దకు వెళ్లి నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ సుఖీభవ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ఇటీవల నిరుపేదలకు సుమారు 50 మందికి అన్నదాన ఆహార పొట్లాలు అందించామని ఇటీవల సుబ్బమ్మ అనే వృద్ధమహిళ తన భర్త రెండు నెలల క్రితం చనిపోగా కుటుంబం గడవలేని పరిస్థితి ఏర్పడిందని తెలుసుకుని ప్రభుత్వం నుండి వస్తున్న పింఛన్ తన మందులకే సరిపోవటం లేదని ఆవేదన వ్యక్తం చేయడంతో ఆమెకు తమ ఫౌండేషన్ ద్వారా సుమారు నెలకు సరిపడా నిత్యవసర సరుకులు బియ్యం కందిపప్పు చింతపండు పంచదార ఉల్లిపాయలు వగైరా లాంటివి అందించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెడన ప్రెస్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అవగాహన ర్యాలీ



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** మండలంలోని చీమలపాడు గ్రామంలో రైతులకు జీఎస్టీ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఏసిఎస్ అధ్యక్షులు బెజవాడ శంకర్ మాట్లాడుతూ గతంలో వ్యసాయ పరికరాలు రైతు సేవా కేంద్రాల ద్వారా ఇవ్వక పోవడంతో బయట మార్కెట్లో అధిక ధరలు చెల్లించి రైతులు నష్టపోయారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టాక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతులకు ఎంతో మేలు చేస్తున్నారన్నారు. వ్యవసాయ పరికరాలు అందుబాటు లోకి తెచ్చింది కూటమి ప్రభుత్వం అంతే కాకుండా దీనికి తోడుగా వ్యవసాయపరికరాల పై జీఎస్టీ తగ్గించడంతో ధరలు కూడా తగ్గడంతో కూటమి ప్రభుత్వానికి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో చీమలపాడు టీడీపీ అధ్యక్షులు కొండేపాటి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి జంగా స్టాలిన్, కోశాధికారి బెజవాడ అదిశేషు, పంచాయతీ కార్యదర్శి గోపి కృష్ణ, రైతు సేవా కేంద్రం ఇంచార్జ్ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

## ఉర్దూ పాఠశాలలో చోరీ



**పెడన, మేజర్ న్యూస్:** స్థానిక 16వార్డులో గల ఉర్దూమిక్స్ పాఠశాలలో దొంగతనం జరిగిందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమయసుల్తానా స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దసరా సెలవులు అనంతరం పాఠశాల తెరవడానికి ఉపాధ్యాయురాలు రాగ తాళం పగలగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా మధ్యాహ్నం భోజన పథకానికి సంబంధించిన సామాగ్రి గ్యాస్ బండ, స్టవ్, హ్యాండ్ వాష్ చేసుకునే ట్యాపులు కనిపించకపోవడంతో వెంటనే సానిక పోలీసులకు సమాచారం అందించామన్నారు. దీంతో సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు చుట్టు పక్కల పరిసరాలను పరిశీలించి, దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

# గుడివాడలో తొలి ఐటి కంపెనీ ప్రారంభం



**100సిట్టింగ్ కెపాసిటీతో ఆపరేషన్స్ ప్రారంభించిన ప్రిన్స్ స్టన్ ఐటీ సర్వీసెస్**

**ఐటీ కంపెనీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

**ప్రిన్స్ స్టన్ ఐటీ సర్వీసెస్ విజయంపై.... గుడివాడ సక్సెస్ ఆధారపడి ఉంది.... ఎమ్మెల్యే రాము**

**గుడివాడ మేజర్ న్యూస్ :** గుడివాడ పట్టణంలో తొలి ఐటి కంపెనీ దసరా పర్వదినాన ప్రారంభమయ్యింది. 100 సిట్టింగ్ కెపాసిటీతో ప్రిన్స్ స్టన్ ఐటీ సర్వీసెస్ సంస్థ గుడివాడలో ఆపరేషన్స్ ప్రారంభించింది. స్థానిక శాసన సభ్యులు వెనిగండ్ల రాము పూజా కార్యక్రమాలు నిర్వహించి శ్రీరాంపురంలో ఏర్పాటు చేసిన ఐటీ సర్వీసెస్ కంపెనీ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంపెనీ ద్వారా అందించనున్న సేవల వివరాలను సీఈఓ కారంశెట్టి రవి ఎమ్మెల్యే రాముకు వివరించారు. అనంతరం ఐటీ కంపెనీ భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రాము ఉద్యోగులతో స్నేహపూర్వకంగా మాట్లాడారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడుతూ నేడు ప్రారంభమైన ఐటీ కంపెనీ విజయవంతంపై గుడివాడ సక్సెస్ ఆధారపడి ఉందన్నారు. ప్రిన్స్ స్టన్ సంస్థను నా సొంత కంపెనీగా భావించి విజయవంతానికి సంపూర్ణ సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఐటీ రంగంలో విజయవంతంగా కొనసాగుతున్న మిత్రుడు రవి సొంత ఊరుపై మమకారంతో గుడివాడ పట్టణంలో ఐటీ కంపెనీ ప్రారంభించడం శుభ పరిణామం అన్నారు. గుడివాడలో ఐటీ రంగంలో తొలి అడుగు పడడం తనకు వ్యక్తిగతంగా ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని ఐటి కంపెనీలు గుడివాడలో ఏర్పాటు అయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. చిన్న స్థాయి పట్టణాలకు ఇలాంటి ఐటీ కంపెనీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. వర్క్ హోం అంటే సొంత ఊరులో పని చేసుకోవడమేనని ఆయన చెప్పారు. ఈ మంచి ప్రయత్నం విజయవంతం కావాలని ఎమ్మెల్యే రాము ఆకాంక్షించారు. పి-4 స్ఫూర్తితో మరింత మంది ప్రవాసులు గుడివాడలో అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే రాము పిలుపునిచ్చారు. ప్రిన్స్ స్టన్ ఐటీ సర్వీసెస్ సీఈవో కారంశెట్టి రవి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అమెరికాలోని న్యూ జెర్సీ, కెనడా, డొమినికా దేశాల్లో సేవలు అందిస్తున్నామన్నారు. మనదేశంలో హైదరాబాద్, కాకినాడలో ఐటీ సంస్థలు నెలకొల్పామని, పుట్టిన ఊరు మీద ప్రేమతో నేడు గుడివాడలో వందమంది పనిచేసేలా సంస్థను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. గుడివాడలో సాఫ్ట్వేర్ ఆపరేషన్స్ ప్రారంభిస్తామని చెప్పగానే ఎమ్మెల్యే రాము ఎంతో ఆనందించి, తనకు సంపూర్ణ సహకారం అందించారన్నారు. ఎమ్మెల్యే రాము ఇచ్చిన మద్దతుతో గుడివాడలో విజయవంతంగా సంస్థను ఏర్పాటు చేయగలిగానని రవి పేర్కొన్నారు. నేడు ఏర్పాటు చేసిన సంస్థ ద్వారా గుడివాడ, ఉఉల పరిసర ప్రాంతాలకు చెందిన టాలెంటెడ్ గల యువతకు అవకాశాలు ఇస్తానని ఆయన చెప్పారు.

జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ బూతులమయంగా మారిన గుడివాడకు రాము లాంటి మంచి వ్యక్తి ఎమ్మెల్యే కావడంతో ఎన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయో ఇప్పటికే చూశామన్నారు. ఎమ్మెల్యే రాము ఆధ్వర్యంలో గుడివాడలో మరిన్ని ఐటి కంపెనీలు వస్తాయని శ్రీకాంత్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చేకూరు జగన్మోహనరావు, నిమ్మగడ్డ సత్యసాయి, పెద్దు శ్రీకాంత్, పట్టణ ప్రముఖులు మాటూరి రంగనాథ్, ఐటి సర్వీసెస్ ప్రతినిధులు, ఉద్యోగులు, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## జీఎస్టీ 2.0 పై ప్రజలకు అవగాహనలో పాల్గొన్న వీఎంసీ కమిషనర్



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఆచార్య రంగా నగర్ ప్రాంతం పర్యటించి జీఎస్టీ 2.0 అవగాహన కార్యక్రమంలో పాల్గొని అక్కడున్న ప్రజలకు కరపత్రాలు అందజేసి అవగాహన కల్పించారు. పాత ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, భగత్ సింగ్ నగర్ రోడ్డు, జివిస్ రాజు రోడ్డు, అజిత్ సింగ్ నగర్ ఫ్లైఓవర్, డాబాకోట్లు సెంటర్, మాకినేని బసవపున్నయ్య స్టేడియం ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ పేద మధ్యతరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్ ఇచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 15 వేల రూపాయల వరకు ఆదా చేసే అవకాశం ఉందని, వ్యాపారులకు అమ్మకాలు పెరుగుదల ఉంటుందని, దేశవ్యాప్తంగా తక్కువ జీఎస్టీ రేట్లు వర్తిస్తాయని రోజువారి ఉపయోగించే చాలా వస్తువులపై జీఎస్టీ 0% లేదా ఐదు శాతం, ప్రధానంగా రెండు పన్నుల స్లాబ్లు మాత్రమే ఉన్నాయి అని తెలిపారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. షమ్మీ, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) ఇంచార్జ్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ శ్రీధర్, సిడిఓ 3 ఉమామహేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం ఘనంగా నిర్వహించాలి...

**జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈనెల 4వ తేదీన జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఆటో డ్రైవర్ సేవలో కార్యక్రమంపై సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సజావుగా ఏర్పాట్లు చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఈ నెల 4 వ తేదీన ఉదయం 11:00 గంటలకు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి అనుగుణంగా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో సంబంధిత శాసనసభ్యులతో సమన్వయం చేసుకుని నిర్వహించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో లబ్ధిదా రులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొనేలా ఆహ్వానం పంపాలన్నారు. లబ్ధిదారుల సౌకర్యార్థం ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం కోసం పెద్ద ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేసి, అన్ని నియోజకవర్గాల కార్యక్రమాలను సమన్వయం చేయాలన్నారు. అధికారులందరూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమన్వయంతో కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లోమ ఆర్టీవో ఎన్ శ్రీనివాస్, డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, డిఎల్ డివోలు, పలువురు రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమం కోసమే కూటమి ప్రభుత్వం



**రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ హసీమ్ బేగ్**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వెనకబడిన మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చేయూత కార్యక్రమాలు తీసుకొస్తుందని ఆంధ్ర ప్రదేశ్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ హసింబేగ్ అన్నారు. మచిలీపట్నం ఆప్టికల్స్ యజమానుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి జరిగిన అభినందన సభలో డాక్టర్ బేగ్ మాట్లాడారు. ఏపీ మైనారిటీస్ రాష్ట్ర కార్పొరేషన్ ద్వారా వెనుకబడిన 8 ముస్లిం మైనారిటీ ప్రధాన కులాలకు పురుషులకు స్త్రీలకు సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. గత ప్రభుత్వం మైనారిటీల పట్ల నిర్లక్ష్య ధోరణి తో వ్యవహరించిందని పేద మైనారిటీలకు ప్రభుత్వ పథకాలు అందలేదని అన్నారు. నేడు నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన మైనార్టీల కోసం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిగి సహాయ కార్యక్రమాలు అందించడం జరుగుతుందని అన్నారు. మచిలీపట్నంలో ఆప్టికల్స్ యజమానుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా ఎన్నికైన మహమ్మద్ నియాజ్‌ను బేగ్ అభినందించారు. కూటమి ప్రభుత్వంలో సామాన్య కార్యకర్తకు కూడా రాష్ట్రస్థాయి పదవులు వరిస్తాయి అని చెప్పడానికి తానే ఉదాహరణ అని అందుకు కృషి చేసిన మంత్రి కొల్లు రవీంద్రకు మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణరావుకు డాక్టర్ బేగ్ ధన్యవాదాలు తెలియజేశారు. సంఘ లీగల్ అడ్వైజర్ గా ఎన్నిక కాబడిన ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ ఒక వ్యక్తిగా సాధించలేనిది అసోసియేషన్ ద్వారా సాధించుకోవచ్చని అన్నారు. ఆప్టికల్ షాపులు కస్టమర్ యొక్క నమ్మకాన్ని పెంపొందించుకోవాలని, అర్హులైన వృద్ధులైన షాపు యజమానులకు పేదవారికి ఇళ్ల స్థలాలు అందించే విధంగా కృషి చేయాలని బాలాజీ కోరారు. మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ మాట్లాడుతూ రాబోయే రోజులలో మచిలీపట్నం గణనీయంగా అభివృద్ధి చెందుతుందని అన్ని వర్గాల వారిని ఆర్థికంగా బలపరచడమే కూటమి యొక్క లక్ష్యమని అన్నారు. నేటి వ్యాపార రంగంలో కార్పొరేట్ స్థాయి వ్యవస్థలు రావటం వలన ఎంతోకాలంగా వ్యాపారం చేసుకుంటున్న వారికి ఇబ్బందులు కలుగుతున్నాయని లాభాపేక్ష లేకుండా వినియోగదారులు నమ్మకం పెంచుకోవడం ద్వారా కార్పొరేట్ సంస్థలకు దీటుగా వ్యాపారం చేయాలని బాబా ప్రసాద్ అన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మాజీ డైరెక్టర్ అజీమ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 16వ వార్డు కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్, వివిధ ఆప్టికల్ షాపుల యజమానులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హసీంబేగ్ ను నూతన అధ్యక్షుడు మహమ్మద్ నియాజ్ ని పూలమాలలుతో ఘనంగా సన్మానించారు.


విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో

ఫోన్ : 9642 980 999